సాక్షి హనుమకొండ

బుధవారం । 2 । ఏప్రిల్ । 2025



సీఎం దిష్టిబొమ్మతో శవయాత్ర

హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ భూముల జోలికొస్తే రేవంత్‌రెడ్డి పతనం తప్పదని కేయూ విద్యార్థులు నినదించారు. సీఎం దిష్టిబొమ్మతో శవయాత్ర నిర్వహించారు. - 8లో▸




నేరాల నియంత్రణకు చర్యలు

కమిషనరేట్ పరిధిలో నేరాల నియంత్రణకు చర్యలు చేపట్టాలని సీపీ సన్‌ప్రీత్‌సింగ్ పోలీస్ అధికారులకు సూచించారు. - 8లో▸

గరిష్ఠం/కనిష్ఠం
34⁰ /24⁰

వాతావరణం

జిల్లాలో ఉదయం వాతావరణం సాధారణంగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండ తీవ్రత ఎక్కువగా ఉంటుంది. వేడిగాలులు వీస్తాయి. రాత్రి ఆహ్లాదకరంగా మారుతుంది.



గుమ్ముడవెల్లి రేణుక (ఫైల్)

నిప్పు కణికలు.. రేణుక రచనలు

- చట్టంపై పట్టుకోసం న్యాయ విద్య..
- విప్లవ ప్రజాపోరాటాల చరిత్ర అక్షరీకరణ
- పలు విప్లవ పత్రికలకు సంపాదకత్వం

దేవరుప్పుల: ప్రజా చైతన్యానికి ఊపిరిలూదిన జనగామ జిల్లా కడవెండిలో పుట్టిన గుమ్ముడవెల్లి రేణుక అదే పోరాట పంథాను ఎంచుకుని అడవిబాట పట్టింది. చిన్నతనంలోనే వివాహం, తదితర ఘటనలు ఆమెను తీవ్రంగా కలిచివేశాయి. ఈనేపథ్యంలో చట్టంపై అవగాహన కోసం న్యాయ విద్యను అభ్యసించింది. ఆమె సోదరుడు ప్రసాద్ అలియాస్ ఉసెండి దండకారణ్యంలో పనిచేసేవాడు. ఈక్రమంలో పోలీసుల అత్యంత నిర్బంధాలను చవిచూసిన తండ్రి సోమయ్య.. కూతురు రేణుకకు యుక్త వయసు రాగానే ఉన్నత చదువులకు అవకాశం ఇవ్వకుండా ఓ వ్యక్తితో వివాహం చేశారు. దీంతో వారి దాంపత్య జీవితంలో పురుషాధిక్యత వంటి అంశాలతో కలహాలు వచ్చాయి. అనివార్యంగా విడాకులు తీసుకోవాల్సి వచ్చింది. యుక్తవయస్సు రాగానే తన ఆలోచనలకు విరుద్ధంగా పితృస్వామ్య వ్యవస్థలో నిర్ణయాలు, అజమాయిషీపై ఆమె తీవ్రంగా ఆలోచించింది. ఈనేపథ్యంలోనే ఓయూలో దూరవిద్యలో డిగ్రీ చేసి చట్టంపై పట్టు కోసం తిరుపతి పద్మావతి విశ్వవిద్యాలయంలో ఎల్ఎల్‌బీ చదివింది.

మూడు రాష్ట్రాల్లో తూటాల్లై పేలిన అక్షరాలు

ఎల్ఎల్‌బీ చదువుతున్న క్రమంలోనే..


రేణుక లా చదువుతున్న సమయంలో అప్పటికే ఉద్యమంలో ఉన్న పద్మక్క, సూర్యం పరిచయమయ్యారు. దీంతో ఆమె ఆలోచనాత్మక ఉద్యమాన్ని బలోపేతం చేసేందుకు ప్రజాసంఘాల్లో భాగస్వామ్యమవుతూ దండకారణ్యం బాట పట్టింది. వరుస ఎన్‌కౌంటర్లు,నిర్బంధ పరిస్థితుల్లో మావోయిస్టు పార్టీ నిర్ణయంతో ఆంధ్రా, ఒడిశా, ఛత్తీస్‌గఢ్‌లో ప్రజాక్షేత్రంలో చోటుచేసుకున్న అనేక కీలక ఘటనలు, ఘట్టాలపై విశ్లేషణాత్మక అధ్యయనాలు చేసి పార్టీకి మార్గదర్శకాలు చేసింది. అజ్ఞాత జీవితాన్ని ఎదుర్కొంటూనే విప్లవ ప్రజాపోరాటాల చరిత్రను అక్షరీకరించింది. నక్సల్స్ తరఫున ప్రభాత్, మహిళా మార్గం, అవామి జంగ్, పీపుల్స్ మార్చ్, పోటియారో పోల్లో, సంఘర్షణ్, భూమ్కల్ సందేశ్, పితురీ వంటి విప్లవ పత్రికలకు సంపాదకత్వం వహించింది. తొలుత భాషాధార(బీడీ) ప్రాంతంలో పని చేసే క్రమంలో బీడీ దమయంతి పేరుతో రచనలు చేసింది.

కడవెండి పడమటి తోట..
నక్సల్స్ ఉద్యమానికి బాట
- వివరాలు 8లో▸

కడవెండికి చేరిన రేణుక మృతదేహం

క్షేత్రస్థాయి పరిస్థితులపై విశ్లేషణాత్మకంగా..

1994లో తాను ఎదుర్కొన్న సంఘర్షణను బట్టి 'మహిళలపై హింస-మండుటెండు గాయాలు' రచన చేసింది. పత్రికల్లో బీడీ దమయంతి పేరిట సల్వాజుడుం విధ్వంసం తీరుపై 'పచ్చని బతుకుల్లో కురుస్తున్న నిప్పులు', ఆదివాసీ భూపోరాటాల విజయపథంలో 'విముక్తి బాటలో నారాయణఖేడ్', భూఆక్రమణలు చేపడుతూ వడ్డీ వ్యాపారుల ఆగడాలు, ఆదివాసీ, దళితుల మధ్య పాలకుల చిచ్చు అంశాలపై మీడియా రూపంలో క్షేత్ర స్థాయిలో విశ్లేషణాత్మక అధ్యయనాలు చేసి మావోయిస్టు అగ్రనేత రామకృష్ణతో పర్యటన చేసింది. సింగన్ మడుగు ఆపరేషన్ గ్రీన్ హంట్ పేరిట అడవిలో ఆరు ఊర్లను తగులబెట్టిన నేపథ్యంపై ఆమె చేసిన రచనలు తుపాకీ తూటాల కంటే రెట్టింపులో పేలి ప్రజాచైతన్యానికి ఊపిరిలూదినట్లు చెబుతుంటారు. యుక్త వయసులో ఓ ఇంటి ఆవిడగా సంఘర్షణ పడి సమ సమాజ స్థాపన కోసం అడవిబాట పట్టిన ఉద్యమ కెరటం రేణుక ప్రస్థానం దంతెవాడ ఎన్‌కౌంటర్‌తో ముగిసినా మెట్లమీద మిడ్కో(మిణుగురు పువ్వు) పేరిట ఆమె రచనలు, సాహిత్యం ఎప్పటికీ గుర్తుండిపోతుందని సాహిత్యాభిమానులు అంటున్నారు.



మిడ్కో కథలు (మెట్ల మీద)

న్యూస్‌రీల్

భద్రకాళి అమ్మవారికి పుష్పార్చన



హన్మకొండ కల్చరల్: భద్రకాళి ఆలయంలో వసంత నవరాత్రోత్సవాల్లో భాగంగా మూడో రోజు మంగళవారం గులాబీ రంగు గన్నేరు పూలతో అమ్మవారికి పుష్పార్చన నిర్వహించారు. ఉదయం ఆలయ అర్చకులు భద్రకాళి శేషు ఆధ్వర్యంలో అమ్మవారికి పూర్ణాభిషేకం, నిత్యాహ్నికం నిర్వహించారు. అనంతరం వేద పండితులు, వేద పాఠశాల విద్యార్థులు గులాబీ రంగు గన్నేరు పూలకు సంప్రోక్షణ నిర్వహించి వాటితో అమ్మవారికి లక్షపుష్పార్చన నిర్వహించారు. ఆలయ ఈఓ శేషు భారతి, దేవాలయ సిబ్బంది పర్యవేక్షించారు.

వేయిస్తంభాల ఆలయంలో మహా సుదర్శన హోమం



హన్మకొండ కల్చరల్: రుద్రేశ్వరస్వామి వారి వేయిస్తంభాల ఆలయంలో జరుగుతున్న శ్రీరామనవమి నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా మూడో రోజు మహా సుదర్శన హోమం నిర్వహించారు. మంగళవారం ఆలయ ప్రధానార్చకుడు గంగు ఉపేంద్రశర్మ ఆధ్వర్యంలో అర్చకులు రుద్రేశ్వరుడికి రుద్రాభిషేకం నిర్వహించారు. సీతారాములకు ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం యాగశాలలో మహా సుదర్శన హోమం నిర్వహించారు. వెంకటేశ్వరరావు, రుక్మిణి దంపతులు, సదాశివుడు, భాగ్యలక్ష్మి దంపతులు హోమ క్రతువుకు ఉభయదాతలుగా వ్యవహరించారు.

సైబర్ క్రైమ్ ఏసీపీ విజయ్‌కుమార్ బదిలీ

వరంగల్ క్రైం: వరంగల్ పోలీస్ కమిషనరేట్‌లో సైబర్ క్రైమ్ ఏసీపీగా పని చేస్తున్న విజయ్‌కుమార్‌ను డీజీపీ కార్యాలయానికి బదిలీ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఆయన స్థానంలో ఖమ్మంలో సైబర్ క్రైమ్ ఏసీపీగా పనిచేస్తున్న ఫణీందర్ వరంగల్ పోలీస్ కమిషనరేట్‌కు బదిలీపై వస్తున్నారు.

కాళేశ్వరాలయంలో భక్తుల రద్దీ



కాళేశ్వరం: కాళేశ్వరంలోని శ్రీకాళేశ్వర ముక్తీశ్వర స్వామి ఆలయ అనుబంధ దేవాలయం శ్రీసుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో కాలసర్ప నివారణ, శని పూజలకు భక్తుల రద్దీ నెలకొంది. మంగళవారం ముందుగా త్రివేణి సంగమ గోదావరిలో భక్తులు పుణ్యస్నానాలు చేసి స్వామివారి ఆలయంలో సామూహికంగా పూజలు నిర్వహించారు. కొంతమంది భక్తులు నవగ్రహాల వద్ద శనిపూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారి గర్భగుడిలో అభిషేక పూజలు చేశారు. దీంతో ఆలయ పరిసరాలు, గోదావరి తీరం వద్ద భక్తులతో సందడి వాతావరణం కనిపించింది.

పదోన్నతి టీచర్లకు శిక్షణ

అన్ని ఏర్పాట్లు చేసిన విద్యాశాఖ

- జిల్లాలో 468 మంది, వరంగల్‌లో 474 మంది పదోన్నతి ఉపాధ్యాయులు
- ఈనెల 3, 4 తేదీల్లో నిర్వహించనున్న రిసోర్స్ పర్సన్లు
- నాయకత్వ లక్షణాల పెంపు, పరిపాలన, అకడమిక్, తదితర అంశాలపై అవగాహన



విద్యారణ్యపురి: పదోన్నతి పొందిన ఉపాధ్యాయులకు ఈనెల 3, 4 తేదీల్లో జిల్లాస్థాయి శిక్షణ ఇచ్చేందుకు హనుమకొండ జిల్లా విద్యాశాఖ ఏర్పాట్లు చేసింది. 2024 విద్యా సంవత్సరంలో జిల్లాలో భారీగా ఉపాధ్యాయులు పదోన్నతి పొందారు. తెలుగు 88 మంది, హిందీ 94 మంది, ఆంగ్లం 17 మంది, గణితం 33 మంది, భౌతిక శాస్త్రంలో ఏడుగురు, జీవశాస్త్రంలో 46 మంది, సాంఘికశాస్త్రంలో 48 మంది, ఫిజికల్ ఎడ్యుకేషన్‌లో 56 మంది టీచర్లు స్కూల్ అసిస్టెంట్లుగా పదోన్నతి పొందారు. ఎల్ఎఫ్ఎల్ హెచ్‌ఎంలుగా 46 మంది, గెజిటెడ్ హెచ్‌ఎంలుగా ముగ్గురు మొత్తం 468 మంది పదోన్నతి పొంది పనిచేస్తున్నారు. వరంగల్ జిల్లాలో 474మంది టీచర్లకు శిక్షణ ఇవ్వనున్నారు.

శిక్షణ కేంద్రాలివే..

హనుమకొండ జిల్లాలోని నాలుగు పాఠశాలల్లో శిక్షణ కేంద్రాలను విద్యాశాఖ ఏర్పాటు చేసింది. తెలుగు, హిందీ టీచర్లకు హనుమకొండలోని ప్రభుత్వ ప్రాక్టీసింగ్ ఉన్నత పాఠశాల, ఎల్ఎఫ్ఎల్ హెచ్‌ఎం ప్రాథమిక పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఫిజికల్ ఎడ్యుకేషన్, ఆంగ్ల ఉపాధ్యాయులకు హనుమకొండలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల, జీవశాస్త్రం, సాంఘికశాస్త్రం టీచర్లకు హనుమకొండ లష్కర్‌బజార్‌లోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల, గణితం, భౌతికశాస్త్రం ఉపాధ్యాయులకు కడిపికొండలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శిక్షణ కేంద్రాలను ఏర్పాటు చేశారు. వరంగల్ జిల్లా వారికి శంభునిపేట హైస్కూల్, రంగశాయిపేట హైస్కూల్, కరీమాబాద్ హైస్కూల్‌లో శిక్షణ కేంద్రాలుగా ఏర్పాటు చేసినట్లు వరంగల్ జిల్లా క్వాలిటీ కో–ఆర్డినేటర్ సుజన్‌తేజ తెలిపారు.

ఈ అంశాలపై శిక్షణ..

ప్రాథమిక పాఠశాలలు, ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు నాయకత్వ లక్షణాల పెంపు, పాఠశాలల నిర్వహణ, పరిపాలన, అకడమిక్, మధ్యాహ్న భోజనం నిర్వహణ తదితర అంశాలపై రిసోర్స్‌పర్సన్లు శిక్షణ ఇవ్వనున్నారు. పాఠ్యపుస్తకాల వినియోగం, తరగతి గదిలో టీచింగ్, లెర్నింగ్ ప్రాక్టీస్, ఐసీటీ పరికరాలు, అకడమిక్ స్టాండర్డ్ అభ్యసన సామర్థ్యాలు, వార్షిక ప్రణాళిక, పాఠ్యప్రణాళిక, యూనిట్ ప్రణాళిక తదితరాల గురించి వివరించనున్నారు.

సాయంత్రం 4.30 గంటల వరకు..

టీచర్లకు ఉదయం 9:30 గంటల వరకే కోర్సు డైరెక్టర్లకు రిపోర్ట్ చేయాలి. సాయంత్రం 4–30 గంటల వరకు శిక్షణ ఇస్తారు. టీ, స్నాక్స్‌తోపాటు మధ్యాహ్న భోజనం ఉంటుంది.

జిల్లాలో ఉన్న ముగ్గురు గెజిటెడ్ హెచ్‌ఎంలు వరంగల్ జిల్లాలో నిర్వహించనున్న శిక్షణకు హాజరుకావాలి. ఉమ్మడి జిల్లాలోని భౌతికశాస్త్ర ఉపాధ్యాయులందరికీ హనుమకొండ జిల్లాలోనే శిక్షణ ఇస్తారు. పలు సబ్జెక్టుల ఉర్దూ స్కూల్ అసిస్టెంట్లు మాత్రం మిగతా సబ్జెక్టుల ఉపాధ్యాయులతో శిక్షణకు హాజరు కావాల్సి ఉంటుంది. ఉర్దూ భాష ఉపాధ్యాయులకు మాత్రం ఈనెల మూడో తేదీన హైదరాబాద్ రాజేంద్రనగర్‌లోని టీజీ ఐఆర్‌డీలో శిక్షణ ఇస్తారు.

శిక్షణకు హాజరుకావాలి..



ప్రస్తుతం పదోన్నతి పొందిన ఉపాధ్యాయులకు రాష్ట్ర ప్రభుత్వం శిక్షణ ఇస్తోంది. ఇందుకు అనుగుణంగా జిల్లాలో శిక్షణ ఇచ్చేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం. తరగతి గదిలో ఎదుర్కొనే ఇబ్బందులను అధిగమించడానికి టీచర్లు శిక్షణకు హాజరు కావాలి.

\- వాసంతి, డీఈఓ

అన్ని ఏర్పాట్లు చేశాం..

జిల్లాలోని నాలుగు పాఠశాలల్లో శిక్షణకు ఏర్పాట్లు పూర్తిచేశాం. అనుభవజ్ఞులైన రిసోర్స్‌పర్సన్లతో ఉదయం 9:30 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు శిక్షణ ఉంటుంది. శిక్షణ కేంద్రాల్లో అన్ని వసతులు కల్పిస్తున్నాం. జిల్లాను గుణాత్మకంగా అభివృద్ధి చేయడంలో విద్యాశాఖ అన్ని ఏర్పాట్లు చేస్తోంది. ఉపాధ్యాయులు తమకు సంబంధించిన పాఠ్యపుస్తకాలతో శిక్షణకు హాజరుకావాలి.



\- ఎ.శ్రీనివాస్, జిల్లా క్వాలిటీ కో–ఆర్డినేటర్

'సన్న బియ్యం'

పేదల ఆత్మగౌరవ పథకం



పరకాల: సన్న బియ్యం పంపిణీ చేస్తున్న పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి



సన్న బియ్యం కాంటా వేస్తున్న టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు

- పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి
- నియోజకవర్గంలో పథకం ప్రారంభం

పరకాల/దామెర/నడికూడ/ఆత్మకూరు: సన్న బియ్యం పథకం నిరుపేదల ఆత్మగౌరవ పథకమని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఆయన పరకాల, నడికూడ, దామెర, ఆత్మకూరు మండలాల్లో పథకాన్ని ప్రారంభించి మాట్లాడారు. ఈపథకం చరిత్రలో నిలిచిపోతుందని అభిప్రాయపడ్డారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి సరిగ్గా లేకపోయినా.. రాష్ట్ర వ్యాప్తంగా సన్న బియ్యం పంపిణీ ద్వారా రాష్ట్రంలో రూ.6 వేల కోట్లు అదనపు భారం పడుతున్నా.. ముఖ్యమంత్రి సాహసోపేత నిర్ణయం తీసుకున్నారన్నారు. ఎల్లవేళలా పేదల గురించి ఆలోచించే పార్టీ ఒక్క కాంగ్రెస్ మాత్రమేనన్నారు. ఎమ్మెల్యే వెంట అధికారులు, కాంగ్రెస్ నాయకులు తదితరులు ఉన్నారు.

ప్రతి ఒక్కరూ సన్నబియ్యంతో భోజనం చేయాలి: మార్నేని

ఐనవోలు: తెలంగాణలో రేషన్ కార్డు కలిగి ఉన్న ప్రతి ఒక్కరూ సన్నబియ్యంతో భోజనం చేయాలనే సంకల్పంతో సీఎం రేవంత్‌రెడ్డి పథకాన్ని ప్రారంభించినట్లు టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలో సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని ఆయన లాంఛనంగా ప్రారంభించారు.

ఉచిత బస్సు ప్రయాణం మాకొద్దు

ఆర్టీసీ ఉచిత బస్సు ప్రయాణం మాకొద్దని ఆత్మకూరు మండల కేంద్రంలో ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డితో మహిళలు అన్నారు. సన్న బియ్యం పంపిణీని ప్రారంభించిన అనంతరం నిర్వహించిన కార్యక్రమంలో కాంగ్రెస్ చేస్తున్న అభివృద్ధి, ప్రవేశపెడుతున్న పథకాలపై ఎమ్మెల్యే మాట్లాడుతుండగా.. మహిళలు కలుగజేసుకుని మాట్లాడారు. ఉచిత బస్సు ప్రయాణం వద్దని.. అవసరమైతే చార్జీలో రాయితీ ఇవ్వాలన్నారు. బస్సులో ప్రయాణిస్తున్నప్పుడు ఆర్టీసీ సిబ్బంది తమను చులకనగా చూస్తున్నారని ఎమ్మెల్యే ఎదుట వాపోయారు. ఎమ్మెల్యే రేవూరి బదులిస్తూ ఈవిషయాన్ని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్తానన్నారు. ఆర్టీసీ సిబ్బంది మహిళల పట్ల మర్యాదగా ప్రవర్తించేలా చర్యలు చేపడతానన్నారు.

ఎండుతున్న మిర్చి పంట

- పరకాల మండలంలో 10 వేల క్వింటాళ్ల దిగుబడి నష్టం

పరకాల: మండుతున్న ఎండలు, భూగర్భజలాలు అడుగంటుతుండడంతో పరకాల మండలంలో మిర్చి పంట ఎండుతోంది. పంటకు సరిగ్గా నీరందకపోవడంతో దిగుబడి గణనీయంగా తగ్గిపోతోంది. పరకాల మండలంలో సుమారు 2 వేల ఎకరాల వరకు మిర్చి సాగు చేశారు. 50 వేల క్వింటాళ్ల దిగుబడి రావాల్సి ఉండగా.. 40 వేల క్వింటాళ్ల దిగుబడి మాత్రమే వచ్చింది. దీంతో 10 వేల క్వింటాళ్ల దిగుబడి నష్టపోయినట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. మరోవైపు పెద్దగా దిగుబడి లేకపోయినప్పటికీ మార్కెట్‌లో మద్దతు ధర కూడా కరువు కావడంతో మిర్చి సాగు చేసిన రైతుల పరిస్థితి ప్రశ్నార్థకంగా మారింది.



ఎండిన మిర్చిని చూపుతున్న రైతు రజిత

వచ్చే ఏడాది కూలీ పనికి వెళ్తా..

మాకున్న రెండెకరాల్లో ఒక ఎకరం మిర్చి సాగు చేశాం. మరో ఎకరంలో కూరగాయలు సాగు చేస్తున్నాం. గతేడాది పెట్టిన పెట్టుబడి కంటే రూ.1 లక్ష లాభం వచ్చింది. ఈ ఏడాది కూడా మిర్చి సాగు చేశాం. రూ.1.80 లక్షలు పెట్టుబడి పెట్టాం. మిర్చి అమ్మితే రూ.10 వేలు నష్టం వచ్చింది. అదేవిధంగా కూరగాయల సాగు కోసం రూ.20 వేలు పెట్టుబడి పెడితే రూ.10 వేలు కూడా రాలేదు. ఇక మీదట వ్యవసాయం చేయం. కూలీ పనికి వెళ్లాలని నిర్ణయించున్నాం.

\- ఆకుల రజిత, మహిళా రైతు

24/7 వైద్య సేవలందేలా చూస్తాం

- జిల్లా వైద్యాధికారి అప్పయ్య
- పీహెచ్‌సీ ఆకస్మిక తనిఖీ

శాయంపేట: 'మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో 24 గంటల వైద్య సేవలందేలా చూస్తాం' అని హనుమకొండ డీఎంహెచ్‌ఓ అప్పయ్య అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆస్పత్రిలోని రికార్డులు, మెడికల్ ల్యాబ్‌ను పరిశీలించి వైద్య సిబ్బందికి సూచనలిచ్చారు. ప్రతీ మంగళవారం నిర్వహిస్తున్న ఆరోగ్య మహిళా క్లినిక్ కోసం వచ్చిన మహిళలతో ఆయన మాట్లాడారు. ఉదయం 11:35 గంటల వరకు 32 మంది మహిళలు పరీక్షలు చేసుకున్నట్లు డాక్టర్ సాయికృష్ణ, డాక్టర్ రమాదేవి తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. గర్భిణులు ప్రతీ మంగళవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఉచిత వైద్య పరీక్షలు చేయించుకోవచ్చని సూచించారు. వైద్య సిబ్బంది సమయపాలన పాటించాలన్నారు. ఈసందర్భంగా గర్భిణులకు సూచనలిచ్చారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో 24 గంటల వైద్య సేవలు అందించడానికి ముగ్గురు స్టాఫ్ నర్సులకు, ఒక ఏఎన్‌ఎంకు బాధ్యతలు అప్పగించనున్నట్లు తెలిపారు. ఆయన వెంట మండల వైద్యాధికారి సాయికృష్ణ, వైద్య సిబ్బంది, ఆశ వర్కర్లు ఉన్నారు.



వైద్య పరీక్షల కోసం వచ్చిన మహిళలతో మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ అప్పయ్య

రజతోత్సవ మహాసభపై సమీక్ష



బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఈ నెల 27న హనుమకొండ జిల్లా ఎల్కతుర్తిలో నిర్వహించతలపెట్టిన పార్టీ రజతోత్సవ మహాసభ ఏర్పాట్లపై మంగళవారం పార్టీ అధినేత కేసీఆర్‌తో ఎర్రవెల్లిలోని తన నివాసంలో ఉమ్మడి జిల్లా నేతలు సమావేశమయ్యారు. సమావేశంలో మండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్, ఎమ్మెల్సీలు మధుసూదనాచారి, తక్కళ్లపల్లి రవీందర్‌రావు, పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, మాజీ మంత్రులు ఎర్రబెల్లి దయాకర్‌రావు, తాటికొండ రాజయ్య, సత్యవతి రాథోడ్, మాజీ ఎంపీ మాలోత్ కవిత, మాజీ ఎమ్మెల్యేలు పెద్ది సుదర్శన్‌రెడ్డి, దాస్యం వినయ్‌భాస్కర్, చల్లా ధర్మారెడ్డి, రెడ్యానాయక్, శంకర్ నాయక్, గండ్ర వెంకట రమణారెడ్డి, నన్నపునేని నరేందర్, నాయకులు లక్ష్మణ్‌రావు, గండ్ర జ్యోతి, నాగజ్యోతి పాల్గొన్నారు.

ప్రీ ప్రైమరీ తరగతులు ప్రారంభించాలి

- ఉపాధ్యాయ మాజీ ఎమ్మెల్సీ నర్సిరెడ్డి

విద్యారణ్యపురి: ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో ప్రీ ప్రైమరీ తరగతులు ప్రారంభించాలని ఉపాధ్యాయ మాజీ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం హనుమకొండ జిల్లా టీఎస్‌యూటీఎఫ్ కార్యాలయంలో హనుమకొండ, వరంగల్ జిల్లాల విస్తృత స్థాయి సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. ఉద్యోగ, ఉపాధ్యాయులకు పెండింగ్‌లో ఉన్న ఐదు విడతల డీఏలను విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇప్పటికే వారంతా రెండేళ్ల పీఆర్సీని నష్టపోయారన్నారు. అలాగే ఉద్యోగ, ఉపాధ్యాయులకు రిటైర్డ్ అయిన వారి పెండింగ్ బిల్లులనూ చెల్లించాలని కోరారు. పెండింగ్‌లో ఉన్న మల్టీ జోన్–1, మల్టీ జోన్–2 హెచ్‌ఎంల పోస్టులకు పదోన్నతులు కల్పించాలన్నారు. ఉపాధ్యాయుల సర్వీస్ రూల్స్‌ను రూపొందించి డిప్యూటీ డీఈఓ పోస్టులను, ప్రభుత్వ డైట్, బీఈడీ కళాశాలల్లో లెక్చరర్లను నియమించాలన్నారు. సమావేశంలో టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకట్, రాష్ట్ర కార్యదర్శి సోమశేఖర్, రాష్ట్ర ఆడిట్ కమిటీ సభ్యులు డి.కిరణ్‌కుమార్, హనుమకొండ, వరంగల్ జిల్లాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సీహెచ్. రవీందర్‌రాజు, తాటికాయల కుమార్, పెండెం రాజు, సి.సుజన్‌ప్రసాద్‌రావు, బాధ్యులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హన్మకొండ: టీజీ ఎన్పీడీసీఎల్ హనుమకొండ టౌన్ డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో బుధవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుందని డీఈ జి.సాంబరెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాంపూర్ ఇండస్ట్రియల్ ప్రాంతంలో ఉదయం 9 నుంచి 11 గంటల వరకు, సోమిడి, జూబ్లీ మార్కెట్, మహంకాళి, తిలక్‌నగర్ ప్రాంతాల్లో ఉదయం 8 నుంచి 10 గంటల వరకు అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు. నయీంనగర్, కిషన్‌పుర, ఈద్గా, పోచమ్మకుంట, కొత్తూరు, కుమార్‌పల్లి ప్రాంతాల్లో మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5 గంటల వరకు, వడ్డేపల్లి, జీఎంఆర్ గార్డెన్స్, టీచర్స్ కాలనీ–2 ప్రాంతాల్లో ఉదయం 8 నుంచి 10 గంటల వరకు, కాంతయ్యనగర్, పోచమ్మగుడి, వివేక్ నగర్, సరస్వతీ నగర్, మాధవనగర్, విజయనగర్, మహాత్మానగర్ ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు వివరించారు.

క్లుప్తంగా

పోలీస్ కస్టడీకి రాజలింగమూర్తి హత్య నిందితులు

భూపాలపల్లి అర్బన్: జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలో ఫిబ్రవరి 19న జరిగిన నాగవెల్లి రాజలింగమూర్తి హత్య కేసు నిందితులను పోలీసు కస్టడీకి అనుమతిస్తూ భూపాలపల్లి జూనియర్ సివిల్ జడ్జి రామచంద్రరావు ఉత్తర్వులు జారీ చేశారు. రేణుకుంట్ల సంజీవ్, పింగిళి సీమంత్, మోరె కుమార్, దాసారపు కృష్ణ, కొత్త హరిబాబును నేటి(బుధవారం) నుంచి ఈ నెల 4వ తేదీ వరకు పోలీస్ కస్టడీకి కోర్టు అనుమతి ఇచ్చింది. హత్యకు సంబంధించిన మరిన్ని వివరాలు, సమాచారం కోసం వీరిని భూపాలపల్లి పోలీసులు అదుపులోకి తీసుకోనున్నారు.

32.750 కేజీల గంజాయి పట్టివేత

- ఇద్దరు ఒడిశా వాసుల అరెస్ట్
- వివరాలు వెల్లడించిన వర్ధన్నపేట ఏసీపీ నర్సయ్య



నిందితుల అరెస్ట్ చూపుతున్న పోలీసులు

వర్ధన్నపేట: వర్ధన్నపేట బస్టాండ్ సమీపం ఎస్‌బీఐ వద్ద 32.750 కేజీల గంజాయి పట్టుకుని ఇద్దరు ఒడిశా వాసులను అరెస్ట్ చేసినట్లు వర్ధన్నపేట ఏసీపీ అంబటి నర్సయ్య తెలిపారు. ఈ మేరకు మంగళవారం సాయంత్రం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. మంగళవారం ఉదయం వర్ధన్నపేట బస్టాండ్ సమీపం ఎస్‌బీఐ వద్ద ఇద్దరు అనుమానస్పదంగా ఉన్నారనే విశ్వసనీయ సమాచారం మేరకు పోలీసులు వెళ్లి తనిఖీ చేయగా గంజాయి లభ్యమైంది. దీంతో అదుపులోకి తీసుకుని విచారించగా ఒడిశాలోని గంజాం జిల్లా జ్యోతినగర్‌కు చెందిన సామ్సంగ్ దళ బెహరా, మరొకరు జ్యోతి నగర్ సురడకు చెందిన మార్తో రోహితోగా తెలిసింది. స్మగ్లర్ నయోని అనే మహిళ ద్వారా సామ్సంగ్ దళ బెహరా, మార్తో రోహితో గంజాయి రవాణా చేయడానికి ఒప్పందం చేసుకున్నారు. ఇందులో భాగంగా ఆమె ఇచ్చిన గంజాయి తీసుకుని ఒడిశాలోని చత్రాపూర్ వద్ద గత నెల 28వ తేదీన రాత్రి పూరి - తిరుపతి రైలు ఎక్కి 29న మధ్యాహ్నం విజయవాడ వద్ద దిగారు. సాయంత్రం 4 గంటలకు విజయవాడ- అహ్మదాబాద్ నవజీవన్ ఎక్స్‌ప్రెస్ ఎక్కి సూరత్ వెళ్తున్న క్రమంలో వరంగల్ రైల్వే స్టేషన్‌లో పోలీసులు బోగీలు తనిఖీ చేస్తున్నారు. దీంతో బయపడి రైలు దిగి వరంగల్ బస్టాండ్ సమీపంలో రాత్రి గడిపారు. పోలీసుల భయంతో రెండు రోజులు వరంగల్‌లోనే గడిపిన అనంతరం మంగళవారం వర్ధన్నపేటకు చేరుకున్నారు. తిరిగి వరంగల్ వెళ్లడానికి బస్సు కోసం వర్ధన్నపేట ఎస్‌బీఐ ఎదుట వేచి చూస్తున్న సమయంలో వారిని అరెస్ట్ చేసి గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు ఏసీపీ నర్సయ్య తెలిపారు. సమావేశంలో సీఐ శ్రీనివాసరావు, ఎస్సై రాజు, సిబ్బంది పాల్గొన్నారు.

అగ్గి.. అడవి బుగ్గి

కార్చిచ్చుతో వేసవిలో వేడెక్కుతున్న ఏజెన్సీ గ్రామాలు



రాత్రి దీపాల వరుసలా దగ్ధమవుతున్న అడవి

- ఎక్కడ చూసినా కాలుతున్న అడవి
- కమ్ముకుంటున్న పొగ..అధిక ఉష్ణోగ్రతలతో అల్లాడుతున్న ప్రజలు, వన్యప్రాణులు

కొత్తగూడ: ఏజెన్సీ గ్రామాలు అనగానే పచ్చని అడవి, ఎత్తైన గుట్టలు, వాగులు, వంకలు, అహ్లాదకర వాతావరణం గుర్తుకువస్తుంది. కానీ వేసవిలో మాత్రం ఆ గ్రామాలు వేడితో ఉక్కిరిబిక్కిరి అవుతాయి. ఎండాకాలంలో అడవి మొత్తం ఆకు రాల్చి మోడులా మారుతుంది. దీంతో ఎక్కడ చిన్న అగ్గి రవ్వ తగిలినా దావానలంలా విస్తరించి అడవినంతా దహించి వేస్తుంది. ఫలితంగా అడవి అంతా మంటలు వ్యాపించి పొగ కమ్ముకుని కనిపిస్తుంది. అసలే భానుడి వేడికి తోడు కార్చిచు మంటలు అంటుకోవడంతో ఇక్కడ వాతావరణం మిగతా ప్రాంతాలకంటే అధిక వేడిని కలిగి ఉంటుంది. మహబూబాబాద్ జిల్లాలోని కొత్తగూడ, గంగారం, గూడూరు,బయ్యారం, వరంగల్‌జిల్లాలోని ఖానాపురం, ములుగు జిల్లాలోని తాడ్వాయి, ఏటూరునాగారం, మల్లంపల్లి మండలాల్లో ఈ పరిస్థితి ఉంటుంది.



మంటలు ఆర్పుతున్న అటవీ శాఖ అధికారులు

అల్లాడుతున్న వన్యప్రాణులు

వేసవి కాలం వచ్చిందంటే చాలు.. వన్య ప్రాణులు, పక్షులకు నీరు లభించడం చాలా కష్టం. దీనికి తోడు అడవులు కాలుతుండడంతో వాటి గూడు చెదిరిపోతుంది. పక్షులు అడవిలో ఉండలేక వేడి వాతావరణాన్ని తట్టుకోలేక మృత్యువాత పడుతున్నాయి. మంటల నుంచి తప్పించుకుని వన్యప్రాణులు జనావాసాల్లోకి, పంట పొలాల వద్దకు వచ్చి వేటగాళ్ల ఉచ్చుల్లో పడుతున్నాయి. దీంతో పాటు విలువైన ఆయుర్వేద మొక్కలు అంతరించిపోతున్నాయి.

మంటలు ఆర్పడం సిబ్బందికి సవాలు

అడవుల్లో మంటలు ఆర్పడం అటవీ శాఖ సిబ్బందికి సవాలుగా మారుతోంది. ప్రభుత్వం మంటలార్పేందుకు అధునాతన మిషన్లు, నిధులు సమకూర్చినా క్షేత్ర స్థాయిలో ఇబ్బందులే ఎదురవుతున్నాయి. రాత్రి పూట మంటలు అంటుకున్న సమయంలో ఆర్పడం సిబ్బందికి సాధ్యం కావడం లేదు. తెల్లవారే సరికి తీవ్ర నష్టం జరుగుతోంది. అడవుల్లో మంటలు విస్తరించకుండా వేసవికి ముందే కాలి బాటలు ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. తీరా మంటలు అంటుకున్న తర్వాతే సిబ్బంది స్పందిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. అడవిలో మంటలకు తునికాకు కాంట్రాక్టర్లలే కారణమనే ఆరోపణలు ఉన్నాయి. అయితే వారిపై ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. తునికాకు మోడెం కొట్టకుండా అడవులకు నిప్పు పెడుతున్నారని స్థానికులు పేర్కొంటున్నారు.

అటవీ దహనాలకు పాల్పడితే చర్యలు

అటవీ దహనాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటాం. మంటలు విస్తరించకుండా సిబ్బందిని అప్రమత్తం చేసి ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటున్నాం. పశువుల కాపరులు, మోడెం కొట్టె కూలీలు అటవీ దహనాలకు కారకులుగా భావించి వారికి కౌన్సెలింగ్ ఇస్తున్నాం. వన్య ప్రాణులు వేటకు గురికాకుండా సిబ్బందితో ప్రత్యేక తనిఖీలు చేయిస్తున్నాం.

– చంద్ర శేఖర్, సబ్ డీఎఫ్ఓ

రేవంత్‌రెడ్డి దిష్టి బొమ్మతో శవయాత్ర

- విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో రాస్తారోకో
- దిష్టిబొమ్మ దహనం.. ఉద్రిక్తత

కేయూ క్యాంపస్: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ భూముల జోలికొస్తే రేవంత్‌రెడ్డి ప్రభుత్వానికి పతనం తప్పదని వివిధ విద్యార్థి సంఘాల బాధ్యులు హెచ్చరించారు. పీడీఎస్‌యూ, ఏఐఎస్ఎఫ్, బీఆర్ఎస్‌వీ, యూఎస్ఎఫ్ఐ, డీఎస్‌ఏ, ఎంఎస్ఎఫ్, ఎన్ఎస్‌యూ, బీఎస్‌యూ, బీఎస్ఎఫ్ విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో మంగళవారం సీఎం రేవంత్‌రెడ్డి దిష్టి బొమ్మతో క్యాంపస్‌లోని ప్రిన్సిపాల్ కార్యాలయం నుంచి కేయూ మొదటి గేట్ వరకు శవయాత్ర నిర్వహించారు. సెంట్రల్ వర్సిటీ భూముల వేలాన్ని నిలిపేయాలని డిమాండ్ చేశారు. భూములను పెట్టుబడిదారులకు కట్టబేట్టాలనే యోచనను విరమించుకోవాలని డిమాండ్ చేస్తూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. మొదటి గేట్ వద్ద దిష్టి బొమ్మ దహనం చేయబోతుండగా.. పోలీసులు విద్యార్థులను అడ్డుకున్నారు. అయినప్పటికీ దహనం చేయడంతో పోలీసులు, విద్యార్థుల మధ్య తోపులాట జరిగింది. దీంతో కొంత సేపు ఉద్రిక్తత చోటు చేసుకుంది. అనంతరం విద్యార్థి సంఘాల బాధ్యులు కేయూ మొదటి గేట్ రోడ్డుపై బైఠాయించి రాస్తారోకో చేశారు. రాస్తారోకోతో ట్రాఫిక్ స్తంభించింది. దీంతో పోలీసులు వారిని అక్కడినుంచి తీసుకెళ్లి మొదటి గేట్ లోపలికి పంపారు. ఈ ఆందోళనలో ఆయా విద్యార్థి సంఘాల బాధ్యులు భాషబోయిన సంతోశ్, బి.నర్సింహారావు, బైరపాక ప్రశాంత్, జెట్టి రాజేందర్, మాచర్ల శరత్, మాలోతు రాజేశ్, కె.శ్రావణ్, గణేశ్, మర్రి మహేశ్, సాయికుమార్, ఎ.గణేశ్, పవన్ కళ్యాణ్, శివనాస్తిక్, యాదగిరి, వేల్పుల చరణ్, ప్రణీత్, వంశీకృష్ణ, వీరు, సూర్యకిరణ్, రంజిత్, దామోదర్, అఖిల్, రాజేశ్ తదితరులు పాల్గొన్నారు.



కేయూ గేట్ వద్ద రాస్తారోకో చేస్తున్న విద్యార్థి సంఘాలు

ప్రమాదవశాత్తు కారు దగ్ధం

- తప్పిన పెను ప్రమాదం..
- మానేరు బ్రిడ్జి వద్ద ఘటన



మల్హర్ : ప్రమాదవశాత్తు ఓ కారు దగ్ధమైంది. ఈ ఘటన మండలంలోని కొయ్యూరు పీవీనగర్ అడవి సోమన్‌పల్లి మానేరు బ్రిడ్జి వద్ద మంగళవారం చోటు చేసుకుంది. కొయ్యూరు ఎస్సై నరేశ్ కథనం ప్రకారం.. టీఎస్18సీ 2008 నంబర్ గల కారు భూపాలపల్లి నుంచి మంథని వైపునకు వెళ్తుంది. ఈక్రమంలో కొయ్యూరు పీవీనగర్ సమీపంలోని మానేరు బిడ్జి వద్ద పొగలు రావడంతో కారులో ప్రయాణిస్తున్న వారు గమనించి కిందికి దిగారు. ఒక్కసారిగా భారీగా మంటలు చెలరేగాయి. దీంతో వారు వెంటనే ఫైరింజన్‌కు సమాచారం ఇవ్వడంతో సిబ్బంది చేరుకుని మంటలు ఆర్పారు. అయితే అప్పటికే కారు పూర్తిగా దగ్ధమైంది. కాగా, కారులో ప్రయాణిస్తున్న నలుగురు పొగలు రావడం గమనించి కిందకి దిగడంతో పెనుప్రమాదం తప్పింది. ఎవరికి ఎలాంటి ప్రాణహాని జరగలేదు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

రైతులను మోసం చేసిన కాంగ్రెస్

- సమస్యల పరిష్కారానికి ఈనెల 4న రైతు సత్యాగ్రహ దీక్ష
- బీజేపీ కిసాన్ మోర్చా జాతీయ నాయకుడు గోలి మధుసూదన్‌రెడ్డి

హన్మకొండ: రైతులను కాంగ్రెస్ పార్టీ దారుణంగా మోసం చేసిందని బీజేపీ కిసాన్ మోర్చా జాతీయ నాయకుడు గోలి మధుసూదన్‌రెడ్డి అన్నారు. మంగళవారం హనుమకొండ హంటర్ రోడ్డులోని కార్యాలయంలో రైతు సత్యాగ్రహ దీక్ష సన్నాహక సమావేశం జరిగింది. ఇందులో గోలి మధుసూదన్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ.. రైతు సమస్యలను సీఎం రేవంత్‌రెడ్డి పట్టించుకోవడం లేదని విమర్శించారు. రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని ఈనెల 4న ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు హనుమకొండలో ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయి రైతు సత్యాగ్రహ దీక్ష చేపట్టనున్నట్లు తెలిపారు. ఈసత్యాగ్రహ దీక్షకు బీజేపీ నాయకుడు, ఎమ్మెల్సీ మల్కా కొమరయ్య ముఖ్య అతిథిగా పాల్గొంటారని తెలిపా రు. ఈనెల 4న హనుమకొండ కలెక్టరేట్ వద్ద నిర్వహించనున్న దీక్షలకు ఉమ్మడి వరంగల్ జిల్లాలోని రైతులు, బీజేపీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.



మాట్లాడుతున్న కిసాన్ మోర్చా జాతీయ నాయకుడు గోలి మధుసూదన్‌రెడ్డి

బీజేపీ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు కొలను సంతోశ్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈసమావేశంలో బీజేపీ హనుమకొండ జిల్లా మాజీ అధ్యక్షురాలు రావు పద్మ, కిసాన్ మోర్చా రాష్ట్ర బాధ్యులు జగన్ మోహన్‌రెడ్డి, మల్లాడి తిరుపతిరెడ్డి, నాయకులు పెద్ది మహేందర్‌రెడ్డి, పుల్యాల రవీందర్‌రెడ్డి, అమరావు, నర్మెట్ట శ్రీనివాస్‌గౌడ్, కేతిపెల్లి సంపత్‌రెడ్డి, నాగరాజు, అరణ్యరెడ్డి పాల్గొన్నారు.

కడవెండి పడమటి తోట.. నక్సల్స్ ఉద్యమానికి బాట

- రాడికల్ స్టూడెంట్స్ పల్లె క్యాంపెయిన్‌లతో చైతన్యం
- సామాజిక వైరుధ్యాలను అధిగమిస్తూ ఐక్యతారాగం
- పోరాట ఫలితంగా నక్సల్బరి వైపు అడుగులు
- కడవెండి మదిలో అమరుల పోరాట స్మృతులు

దేవరుప్పుల : తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో విస్నూర్ దేశ్‌ముఖ్‌లను ఎదురించి భూమి.. భుక్తి.. బానిస బంధాల విముక్తి పొందిన కడవెండి ప్రజలు నిలువ నీడ కోసం చేసిన పడమటి తోట ఇళ్ల స్థలాల పోరాటం.. నక్సల్స్ ఉద్యమానికి బాట అయ్యింది. జనగామ జిల్లా దేవరుప్పుల మండలం కడవెండిలో 1980లో వామపక్ష పార్టీల నేతృత్వంలో స్థానిక భూస్వామి అస్నాల రాజయ్యకు చెందిన పడమటి తోటలో బీసీ సామాజికవర్గ పేదలు గుడిసెలు వేశారు. ఈ పోరాటానికి తొలుత తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో కీలక పాత్ర పోషించిన నల్లా నర్సింహులు నేతృత్వం వహించినప్పటికీ సఫలీకృతం కాలేదు. ఈ తరుణంలో కొత్తగా ఆవిర్భవించిన సీపీఐ(ఎంఎల్) నాయకుడు అంజాజీ నేతృత్వం వహించారు. ఈ తరుణంలోనూ సదరు భూస్వామి ఎస్సీ, ఎస్టీలను పురమాయించి ఈ పోరాటానికి చెక్ పెట్టేందుకు యత్నించారు. దీంతో భూపోరాటం నిర్వీర్యమయ్యే క్రమంలో 1982లో రాడికల్ స్టూడెంట్స్ ఆధ్వర్యంలో వేసవిలో పల్లె క్యాంపెయిన్‌లు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో అప్పటికే 'లా' విద్యనభ్యసిస్తున్న ఎర్రంరెడ్డి పురుషోత్తంరెడ్డి నివాసిత భూపోరాట విజయం కోసం ఆర్ఎస్‌యూ పక్షాన పావులు కదిపారు. ఎస్సీ, ఎస్టీలను చైతన్య పరుచడంతో పడమటి తోట పోరాటానికి వారు సంఘీభావం పలికారు. దీంతో ఉద్యమం తీవ్రరూపం దాల్చింది. ఈ విషయంలో అనేక మందిపై కేసులు నమోదైనా పోరాటం తగ్గలేదు. దీంతో భూ యజమాని దిగొచ్చి కేసులు ఉపసంహరించుకున్నారు. నల్లా నర్సింహులు ఉద్యమ స్ఫూర్తితో అతడి తమ్ముడు నల్ల మల్లయ్య, బావమరిది బిట్ల ముత్తయ్య పడమటి తోట సాధించుకునేందుకు దోహదపడ్డారని పురుషోత్తం రెడ్డి పేర్కొనడం గమనార్హం.



కడవెండిలో నాలుగు దశాబ్దాల క్రితం సాధించుకున్న నివాసిత ప్రాంతం పడమటితోట

పీపుల్స్‌వార్ పార్టీ నిర్మాణంలో గ్రామస్తుల కీలక పాత్ర..

ఐక్యంగా నిలువ నీడలేని పేదలకు స్థలాల సాధనతో స్థానిక స్టూడెంట్స్, యువత రాడికల్ సంఘం వైపు ఆకర్షితులై రాష్ట్ర ఉత్తర తెలంగాణ స్థాయి పీపుల్స్‌వార్ పార్టీ నిర్మాణంలో గ్రామస్తులు కీలక పాత్ర పోషించేలా ఎదిగారు. ఈ క్రమంలోనే పీపుల్స్ వార్ నాయకులు తుపాకులు చేతబూని సింగిల్ ఆర్గనైజర్ వ్యవస్థ విస్తరించే క్రమంలో ఇళ్ల స్థలాల పోరాట నేపథ్యంలో జనశక్తి, పీపుల్స్‌వార్ మధ్య వైరుధ్యం పెరిగింది. దీంతో ఆధిపత్యం కోసం పురుషోత్తంరెడ్డి అలియాస్ ఎపీకి బదులు పీపుల్స్ వార్‌కు సహకరిస్తున్నాడనే కారణంతో సీతారాంపురంలో ఉపాధ్యాయ వృత్తిలో కొనసాగుతున్న ఎర్రంరెడ్డి సోమిరెడ్డిని జనశక్తి నక్సల్స్ కాల్చి చంపారు. ఈ ఘటనతో పరిస్థితి పచ్చగడ్డి వేస్తే భగ్గుమనేలా తయారైన క్రమంలోనే పురుషోత్తం రెడ్డి వరంగల్ కాకతీయ విశ్వవిద్యాలయం వేదికగా, అతడి సోదరుడు ఎర్రంరెడ్డి సంతోశ్‌రెడ్డి ఉస్మానియా విద్యాలయం వేదికగా కొండపల్లి సీతారామయ్య, వరవరరావు ఆధ్వర్యంలో పీపుల్స్‌వార్‌లో పూర్తిస్థాయిలో చేరి పార్టీలో కీలక భూమిక పోషించారు. అప్పట్లో ఇదే గ్రామంలో చారుముజుందార్ వర్ధంతి సభతో నక్సల్స్ ఉద్యమం బలపడింది. ఈ తరుణంలో పీపుల్స్ వార్ పార్టీ, అనుబంధ ప్రజానాట్య మండలి విభాగంలో రాష్ట్ర స్థాయిలో అనేక మంది పనిచేశారు. ఎట్టకేలకు ఐదు దశాబ్దాల నక్సల్స్ ఉద్యమ నేపథ్యంలో ఈ గ్రామం నుంచి సంతోశ్‌రెడ్డి అలియాస్ మహేశ్, పైండ్ల వెంకటరమణ, గుమ్ముడవెల్లి రేణుక, పెద్ది శ్రీను, జనశక్తి నేత పెద్ది యాదగిరి ఇతర ప్రాంతాల్లో ఎన్‌కౌంటర్ పేరిట హతమవడం కొసమెరుపు.

సాక్షి క్లాసిఫైడ్స్

SERVICES

■ హౌస్, ఫ్లాట్, వ్యవసాయ భూములు మార్టిగేజ్ చేసుకొని అమౌంట్ ఇప్పించబడును. Cibil అవసరం లేదు. Cont: 7416374863. [WA-7557]

CHANGE OF NAME

■ I, DEVARAKONDA RAMADEVI, W/o Gadipe Bikshapathi, R/o.H.No.5-27 Koppur, Bheemadevarapally, Hanumakonda, declare that my name was recorded as Devarakonda Ramadevi D/o Ramchandar in educational records. After marriage, it changed to GADIPE RAMADEVI W/O. BIKSHAPATHI. Both names refer to the same person. Henceforth, I shall be known as Devarakonda Ramadevi W/o Gadipe Bikshapathi for all legal and official purposes. [W-1265081]

మహిళలకు శుభవార్త

■ శ్రీశైలీ బ్యూటీపార్లర్‌లో ఫ్రీ బ్యూటీషియన్ కోర్సు గవర్నమెంట్ సర్టిఫికేట్‌తో నేర్పించబడును టైలరింగ్, మగ్గం వర్క్, మెహిందీ 5 వేలకే with సర్టిఫికేట్‌తో నేర్పబడును. 9989060668. [W-1265082]

అమ్మబడును

■ అమ్మబడును. దామెర మండలం, ఒగ్లాపూర్ గ్రామంలో ఉన్న దేశవాళి గొర్లు, పొట్టేళ్ళ మంద అమ్మబడును. సుమారుగా 170 గొర్లు చిన్న పెద్ద కలిపి ఉంటాయి. సెల్: 90302 41156 [MW 12938]

4 లైన్ల క్లాసిఫైడ్ ప్రకటన రూ. 260/- అదనపు లైను రూ. 60/- మాత్రమే 5% GST అదనము

BUSINESS OFFER

■ శ్రీగోల్డ్ బైయర్స్ మీ బంగారం మణప్పురం ముత్తూట్, మార్వాడీ షాప్ ఏ ఫైనాన్స్‌లో ఉన్నా మా డబ్బుతో విడిపించి మార్కెట్ ధరకు కొనబడును. ఫోన్: 9010190666. [SCA25002404]

WANTED

■ Hospital Staff, Lab Technicians (Exp), OT - Technicians, Medical Shop Boys (Exp) & Aayammas. Contact: Guardians Hospital, Mulugu "X" Road, Warangal 12 to 2 pm [WA-498]

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకై సంప్రదించండి

హన్మకొండ : 9010144453
వరంగల్ : 9705748198
నర్సంపేట : 9553955722
జనగామ : 9951602871
మహబూబాబాద్ : 9010144453
పరకాల : 9010299096
జయశంకర్ భూపాలపల్లి : 9705748198

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

హెల్త్ సూపర్‌వైజర్ దారుణ హత్య

మానుకోట మున్సిపాలిటీ పరిధి బోరింగ్‌తండా సమీపంలో ఘటన

ఘటనా స్థలిని సందర్శించిన ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్



పార్థసారథి (ఫైల్)

మహబూబాబాద్ రూరల్ : ఓ గురుకులంలో హెల్త్ సూపర్‌వైజర్‌గా విధులు నిర్వర్తిస్తున్న వ్యక్తి దారుణ హత్యకు గురయ్యాడు. ఈ ఘటన మహబూబాబాద్ మున్సిపాలిటీ పరిధి శనిగపురం గ్రామ శివారు బోరింగ్‌తండా సమీపంలో చోటు చేసుకుంది. రూరల్ సీఐ పి.సర్వయ్య కథనం ప్రకారం.. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల మండలానికి చెందిన తాటి పార్థసారథి (42) భద్రాచలంలోని జగదీశ్ కాలనీలో నివాసముంటున్నాడు. 11 ఏళ్ల క్రితం ఏపీలోని తూర్పుగోదావరి జిల్లా రేకపల్లే గ్రామానికి చెందిన స్వప్నతో వివాహం జరిగింది. వారికి పిల్లలు భార్గవ్‌సాయి, పరమేశ్వరి ఉన్నారు. పార్థసారథి మహబూబాబాద్ జిల్లా దంతాలపల్లి మండల కేంద్రంలోని మహాత్మాజ్యోతిబాపూలే గురుకుల పాఠశాలలో ఏడాది కాలంగా హెల్త్ సూపర్‌వైజర్‌గా విధులు నిర్వర్తిస్తున్నాడు. భార్య స్వప్న, పిల్లలు భార్గవ్‌సాయి, పరమేశ్వరి భద్రాచలంలోని జగదీశ్ కాలనీలో ఉంటున్నారు. పార్థసారథి మాత్రం దంతాపల్లి మండల కేంద్రంలో అద్దె ఇంట్లో ఉంటూ సెలవు రోజుల్లో ఇంటికి వెళ్లి వస్తుంటాడు. ఈ క్రమంలో శుక్రవారం సాయంత్రం భద్రాచలం వెళ్లి సోమవారం సాయంత్రం అక్కడి నుంచి బయలుదేరాడు. తాను వస్తున్నానని తన గది యజమానికి ఫోన్ చేసి ఇంటి గేటు వేయొద్దని చెప్పాడు. ఈ క్రమంలో మంగళవారం తెల్లవారుజామున బోరింగ్‌తండా సమీపంలోని మిరప చేనులో ఓ వ్యక్తి మృతి చెంది ఉండడాన్ని స్థానిక రైతులు గమనించి డయల్ 100కు ఫోన్ చేసి సమాచారం తెలిపారు. దీంతో రూరల్ ఎస్సై వి.దీపిక, సీఐ పి.సర్వయ్య, డీఎస్పీ ఎన్.తిరుపతిరావు ఘటనా స్థలిని పరిశీలించి ఎస్పీ సుధీర్‌రాంనాథ్ కేకన్‌కు సమాచారం ఇవ్వగా ఆయన హుటాహుటిన చేరుకున్నారు. డాగ్‌స్క్వాడ్, ఫింగర్‌ప్రింట్స్, క్లూస్‌టీం బృందాలు వివరాలు సేకరించాయి. ఘటనాస్థలికి చేరుకున్న మృతుడి సోదరి మద్దుల హేమవరలక్ష్మి, బావ శివప్రసాద్ బోరున విలపించారు. హేమవరలక్ష్మి మాట్లాడుతూ.. తన సోదరుడు పార్థసారథిపై ఏడాది క్రితం దాడి జరిగిందని తెలిపారు. మరదలు స్వప్నకు వివాహేతర సంబంధం ఉందని ఆరోపించారు. ఈ కారణంగానే తమ సోదరుడి హత్య జరిగి ఉండొచ్చని పేర్కొన్నారు. కాగా, పోలీస్ స్టేషన్‌లో పార్థసారథిని దుండగులు హత్య చేసి చంపారని ఫిర్యాదు చేశారు. ఉమ్మడి వరంగల్ జిల్లా బీసీ గురుకులాల ఆర్‌సీఓ రాజ్‌కుమార్.. పార్థసారథి హత్యపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. కాగా, డీఎస్పీ తిరుపతిరావు, రూరల్ సీఐ సర్వయ్య, ఎస్సై దీపిక, బయ్యారం సీఐ రవికుమార్, ఎస్సై తిరుపతి, సీసీఎస్ సీఐ హథీరాం, ఇతర పోలీసుల అధికారులు నిందితుల కోసం గాలింపు చర్యలు ముమ్మరం చేశారు.



ఘటనాస్థలిని పరిశీలిస్తున్న ఎస్పీ సుధీర్ ఆర్ కేకన్

కీలకం కానున్న హెల్మెట్..

పార్థసారథి హత్య విషయంలో ఘటనా స్థలిలో లభ్యమైన హెల్మెట్ కీలకం కానున్నట్లు విశ్వసనీయ సమాచారం. నిందితుల రాకపోకలు, వాళ్లు వాడిన ద్విచక్రవాహనం ఆచూకీ గురించి పోలీసులు ఆరా తీస్తున్నారు. సీసీ పుటేజీల్లో నిందితులు హత్య చేయడానికి వచ్చే ముందు ఆ వాహనం నడిపిన వ్యక్తి ధరించిన హెల్మెట్ తెలుపురంగులో ఉండగా, ఘటనా స్థలిలో లభించిన హెల్మెట్ కూడా అదే రంగులో ఉండడం గమనార్హం. పార్థసారథి హెల్మెట్ ధరించకుండా ద్విచక్ర వాహనంపై ప్రయాణించినట్లు పోలీసులు గుర్తించారు. భద్రాచలం నుంచి హత్య జరిగిన ప్రాంతం వరకు రహదారుల వెంట ఉన్న సీసీ పుటేజీని పోలీసులు సేకరించే పనిలో నిమగ్నమయ్యారు.

గురుకుల పాఠశాలలో విషాదఛాయలు

దంతాలపల్లి : మండలకేంద్రంలోని మహాత్మా జ్యోతిబా పూలే గురుకులంలో విషాదఛాయలు అలుముకున్నాయి, పాఠశాలలో హెల్త్ సూపర్‌వైజర్‌గా విధులు నిర్వహిస్తున్న తాటి పార్థసారథి జిల్లా కేంద్రం సమీపంలో దారుణ హత్యకు గురైన విషయం విధితమే. ఈ ఘటనపై విద్యార్థులు, ఉపాధ్యాయ బృందం దిగ్భ్రాంతి వ్యక్తం చేసింది. పార్థసారథి విద్యార్థుల ఆరోగ్యంపై నిరంతరం జాగ్రత్తలు తీసుకునేవారని, పాఠశాలకు సంబంధించిన ప్రతీ పనిని అంకితభావంతో చేసేవారని విద్యార్థులు, ఉపాధ్యాయులు తెలిపారు. నిబద్ధత గల ఉద్యోగిని కోల్పోయామని ఉపాధ్యాయులు ఆవేదన వ్యక్తం చేశారు.

నేరాల నియంత్రణకు కట్టుదిట్టమైన చర్యలు

- సీపీ సన్‌ప్రీత్ సింగ్

వరంగల్ క్రైం: కమిషనరేట్ పరిధిలో నేరాల నియంత్రణకు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ పోలీసు అధికారులకు, సిబ్బందికి సూచించారు. మంగళవారం ఆయన హనుమకొండ డివిజన్ పరిధి హనుమకొండ, కేయూసీ, హనుమకొండ ట్రాఫిక్, సుబేదారి మహిళా పోలీస్ స్టేషన్లను సందర్శించారు. సీపీగా బాధ్యతలు చేపట్టిన అనంతరం మొదటిసారిగా హనుమకొండ డివిజన్ పోలీస్‌స్టేషన్లను సందర్శించిన ఆయన ముందుగా స్టేషన్ల పరిసరాలు, సీసీ కెమెరాల పనితీరును పరిశీలించారు. అనంతరం స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న పోలీస్ అధికారులు, సిబ్బంది వివరాలను సంబంధిత ఇన్‌స్పెక్టర్లను అడిగి తెలుసుకున్నారు. స్టేషన్‌ల పరిధిలో సెక్టార్ల సంఖ్య, ఎక్కువగా జరిగే నేరాలు, ఎస్సైలు నిర్వహిస్తున్న విధులు, రౌడీషీటర్లు, అనుమానితులు వారి ప్రస్తుత స్థితిగతులను ఎస్సైలను అడిగి తెలుసుకున్నారు. బ్లూకోల్ట్స్ సిబ్బంది పనితీరు, వారు విధులు నిర్వహించే సమయాలను ఆరా తీశారు. ఈసందర్భంగా సీపీ సన్‌ప్రీత్ సింగ్ మాట్లాడుతూ.. ప్రతీ స్టేషన్ అధికారి తప్పనిసరిగా రౌడీ షీటర్ల ఇళ్లను సందర్శించి వారి స్థితిగతులను ప్రత్యక్షంగా ఆరా తీయాలని, సైబర్ నేరాలకు పాల్పడిన వారి మూలాల వరకు దర్యాప్తు చేపట్టాలని ఆదేశించారు. గంజాయి, మత్తు పదార్థాల క్రయ విక్రయాలపై ప్రత్యేక దృష్టి సారించి మత్తు పదార్థాల నియంత్రణకు సమష్టిగా పని చేయాలన్నారు. నేరాల నియంత్రణకు విజిబుల్ పోలీసింగ్ అవసరమని, ఇందుకు నిరంతరం పెట్రోలింగ్ నిర్వహించాలని అధికారులకు సూచించారు. సీపీ వెంట హనుమకొండ ఏసీపీ దేవేందర్‌రెడ్డి, ట్రాఫిక్ ఏసీపీ సత్యనారాయణ, ఇన్‌స్పెక్టర్లు సతీశ్, సత్యనారాయణ, రవికుమార్, సీతారెడ్డి, సువర్ణ, ఎస్సైలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



సుబేదారి మహిళా పోలీస్‌స్టేషన్‌ను పరిశీలిస్తున్న సీపీ

కడవెండికి చేరిన రేణుక మృతదేహం

- నేడు అంత్యక్రియలు
- బంధు, మిత్రులు, మాజీల ఘన నివాళి

దేవరుప్పుల: ఛత్తీస్‌గఢ్‌లోని దంతెవాడ ఎన్‌కౌంటర్‌లో అసువులు బాసిన దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ సభ్యురాలు గుమ్ముడవెల్లి రేణుక అలియాస్ చైతే అలియాస్ సరస్వతి మృతదేహం మంగళవారం అర్ధరాత్రి 12.45 గంటలకు ఆమె స్వగ్రామం జనగామ జిల్లా దేవరుప్పుల మండలం కడవెండికి చేరింది. బుధవారం అంత్యక్రియలు జరగనున్నాయి. కాగా, దంతెవాడ నుంచి రేణుక మృతదేహాన్ని ఆమె సోదరులు జీవీకే ప్రసాద్, రాజశేఖర్ స్వగ్రామం తీసుకురాగా గ్రామస్తులు, బంధు, మిత్రులు కన్నీరుమున్నీరుగా విలపించారు. మూడు దశాబ్దాల క్రితం ఊరు విడిచి అడవి బాటపట్టిన రేణుక విగతజీవిగా రావడంతో తల్లిదండ్రులు జయమ్మ, సోమయ్య గుండెలవిసేలా రోదించారు. పెద్దనాన్న లక్ష్మీనర్సు ఇంటి వేదికగా దొడ్డి కొమురయ్య స్మారక స్తూపం వద్ద ప్రజల సందర్శనార్థం రేణుక మృతదేహం ఉంచారు. ఈ సందర్భంగా మాజీ మావోయిస్టులు గాదె ఇన్నయ్య, గాజర్ల అశోక్, తెలంగాణ రెడ్‌ఫ్లాగ్ రాష్ట్ర కమిటీ కార్యదర్శి రాజేష్ ఖన్నా, ఓయూ జేఏసీ నాయకుడు ఇప్ప పృథ్వీరెడ్డి.. రేణుక మృతదేహం వద్ద నివాళులర్పించారు. అనంతరం వారు వేర్వేరుగా మాట్లాడుతూ అనారోగ్యంతో నిరాయుధంగా పట్టుబడిన రేణుకను చిత్రహింసలు పెట్టి కాల్చి చంపారని ఆరోపించారు. ఇలాంటి బూటకపు ఎన్‌కౌంటర్లకు పాలకవర్గాలు స్వస్తి పలకాలని డిమాండ్ చేశారు.



రేణుక మృతదేహాన్ని తీసుకువస్తున్న అంబులెన్స్



దొడ్డి కొమురయ్య స్మారకస్తూపం వద్దకు చేరుకున్న రేణుక మృతదేహం